# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ:  02-01-2025                    సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

❖ కాశ్మీర్ దేశ నాగరికతలో అంతర్భాగమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఉద్ఘాటించారు.

❖ సౌర విద్యుత్ ఉత్పత్తిలో భారతదేశం గణనీయమైన ప్రగతి సాధిస్తోందని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు.

❖ ఢిల్లీని కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దుతామని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ స్పష్టం చేశారు.

❖ జాతీయ క్రీడా అవార్డులను కేంద్ర ప్రభుత్వం ఈ రోజు ప్రకటించింది.

❖ బీహార్, కేరళ రాష్ట్రాలలో నూతన గవర్నర్లు ఈరోజు పదవీప్రమాణ స్వీకారం చేశారు.

========================

కాశ్మీర్ కేవలం భారత ప్రాదేశిక భాగం మాత్రమే కాదని, దేశ నాగరికతలో అంతర్భాగమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఉద్ఘాటించారు. న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన “జమ్మూ, కశ్మీర్ అండ్ లడఖ్ త్రూ ది ఏజెస్” పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... జమ్మూ కాశ్మీర్ భారత్ లోనే వేల సంవత్సరాలుగా విలీనం అయి ఉన్నాయని గుర్తు చేశారు. 8 వేల నాటి పురాతన గ్రంథాలలో కూడా ఈ విషయాలు ఉన్నాయని అమిత్ షా ప్రస్తావిస్తూ...

(వాయిస్ 34 సెకన్లు)

========================

గత పదేళ్లలో భారతదేశం 95.5 గిగావాట్ల సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేసిందని కేంద్ర పునరుత్పాదక విద్యుత్ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. గతంలో ఇది 2.3 గిగావాట్లుగా మాత్రమే ఉండేదని గుర్తు చేశారు. కర్ణాటకలోని మంగళూరులో “ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన”పై ఈ రోజు జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం అందించే రాయితీలను సద్వినియోగం చేసుకుంటూ సొంతంగానే సౌర విద్యుత్‌ను

ఉత్పత్తి చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. విద్యుత్ రంగంలో సుస్థిరతతోనే దేశానికి సురక్షిత భవిష్యత్తు ఏర్పడనుందని అన్నారు. ఇంటి పైకప్పుపై సౌర ఫలకాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లును తగ్గించుకోవచ్చునని కేంద్రమంత్రి తెలిపారు. “ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన” ద్వారా దేశవ్యాప్తంగా కోటి మంది ప్రజలకు సౌర విద్యుత్ ఏర్పాటుకు రాయితీ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన వెల్లడించారు.

========================

జాతీయ క్రీడా అవార్డులను కేంద్ర ప్రభుత్వం ఈ రోజు ప్రకటించింది. ప్రపంచ చెస్ ఛాంపియన్ డి.గుకేష్, పారిస్ ఒలింపిక్స్ లో రెండు పతకాలు సాధించిన మను భాకర్, భారత హాకీ జట్టు కెప్టెన్ హర్మన్ ప్రీత్ సింగ్, పారిస్ పారాలింపిక్స్ గోల్డ్ మెడలిస్ట్ ప్రవీణ్ కుమార్ లను మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న అవార్డులకు ఎంపిక చేశారు. అదే విధంగా 32 మంది క్రీడాకారులకు అర్జున అవార్డును ప్రదానం చేయనున్నారు. వీరిలో అథ్లెట్లు జ్యోతి యర్రాజీ, అన్ను రాణి, బాక్సర్లు నీతూ, సవీతి, చెస్ క్రీడాకారిణి వంటికా అగర్వాల్, హాకీ క్రీడాకారులు సలీమా టెటె, అభిషేక్, సంజయ్, జర్మన్ ప్రీత్ సింగ్, సుఖ్జీత్ సింగ్ పారా ఆర్చర్ రాకేశ్ కుమార్, పారా అథ్లెట్లు ప్రీతి పాల్, జీవన్జీ దీప్తి, అజిత్ సింగ్, సచిన్ ఖిలారీలు ఉన్నారు. ఈ నెల 17న రాష్ట్రపతి భవన్ లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు గ్రహీతలు పురస్కారాలను అందుకోనున్నారు.

========================

దేశ రాజధాని ఢిల్లీని రానున్న 5 సంవత్సరాల్లో కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దుతామని కేంద్ర రహదారులు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ స్పష్టం చేశారు. ఈ రోజు పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ... ఢిల్లీలో ఇప్పటికే అనేక కార్యక్రమాలను ఆ దిశగా చేపట్టమని తెలిపారు. నమామి గంగే పథకం మాదిరిగానే యమునా నదిని ప్రక్షాళన చేసే కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం రూపొందిస్తోందని అన్నారు. దేశవ్యాప్తంగా కాలుష్య ప్రమాదాన్ని అరికట్టేందుకు దాదాపుగా 60 వేల కోట్ల రూపాయలతో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. దేశంలో నలభై శాతం కాలుష్యం శిలాజ ఇంధన వినియోగం వల్లనే వస్తోందని అన్నారు. దీనికి పరిష్కారంగా విద్యుత్ తో నడిచే వాహనాలను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నామని కేంద్ర మంత్రి పేర్కొంటూ..

(వాయిస్ 28 సెకన్లు)

========================

బీహార్ 42వ గవర్నర్ గా ఆరిఫ్ ముహమ్మద్ ఖాన్ ఈ రోజు ప్రమాణ స్వీకారం చేశారు. పాట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కె.వినోద్ చంద్రన్ ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నితీష్ కుమార్, ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి, రాష్ట్ర మంత్రులు, హాజరయ్యారు. అదే విధంగా కేరళ 23వ గవర్నర్ గా రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ ప్రమాణ స్వీకారం చేశారు. కేరళ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నితిన్ మధుకర్ జామ్దార్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, ఆయన మంత్రివర్గ సహచరులు, వివిధ రాజకీయ పార్టీల సీనియర్ నాయకులు హాజరయ్యారు.

విరామం

========================

దేశవ్యాప్తంగా జేఈఈ మెయిన్ పేపర్-1 ఆన్‌లైన్ పరీక్షలు ఈ నెల 22, 23, 24, 28, 29వ తేదీల్లో నిర్వహించనున్నామని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ -ఎన్‌టీఏ వెల్లడించింది. ఎన్ఐటీల్లో ఇంజనీరింగ్ ప్రవేశాల భర్తీకి పేపర్-1 పరీక్షను ఎన్‌టీఏ నిర్వహించనుంది. అలాగే ఆర్కియాలజీ, ప్లానింగ్ గ్రాడ్యుయేషన్ కోర్సుల ప్రవేశాల భర్తీకి పేపర్-2ను ఈ నెల 30న మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల 30 నిమిషాల వరకు నిర్వహిస్తామని పేర్కొంది. హాల్ టికెట్లను పరీక్ష తేదీకి 3 రోజుల ముందు విడుదల చేయనున్నామని తెలిపింది.

========================

మన్నతు పద్మనాభన్ జయంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ రోజు ఆయనను స్మరించుకున్నారు. సమాజ చైతన్యంతో పాటు మహిళాసాధికారతకు అవిశ్రాంతంగా కృషి చేసిన నిజమైన దార్శనికుడని కొనియాడారు.

========================

కేంద్ర ప్రభుత్వం ప్రపంచ చెస్ ఛాంపియన్ డి.గుకేష్ కి 'ఖేల్ రత్న' అవార్డును ఈ రోజు ప్రకటించింది. ఈ సందర్భంగా స్పందించిన గుకేష్ పాత్రికేయులతో మాట్లాడుతూ... ప్రతిష్టాత్మకమైన మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న అవార్డును అందుకోవడం తనకు ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. తాను ఆటలో మరింతగా రాణించడానికి ఈ అవార్డు మంచి ప్రోత్సాహంగా ఉంటుందని పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

కాగా, గుకేష్ ఇటీవల చైనాకు చెందిన డింగ్ లిరెన్‌ను ఓడించి అతి పిన్న వయస్కుడైన ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా నిలిచారు. విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ఈ టైటిల్ గెలుచుకున్న రెండో భారతీయుడుగా రికార్డు నెలకొల్పారు.

========================

ఈ నెల 12 నుంచి 45 రోజుల పాటు ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగ్‌రాజ్ లో మహా కుంభమేళా ఘనంగా జరగనుంది. ఇందుకోసం ఇప్పటికే ప్రత్యేక రైళ్లను నడుపుతోన్న రైల్వే శాఖ. తాజాగా తెలుగు రాష్ట్రాల నుంచి వెళ్లేవారి కోసం అదనంగా మరో 26 ప్రత్యేక రైలు సర్వీసులను నడపనున్నట్లు ప్రకటించింది. రాష్ట్రంలోని గుంటూరు, విజయవాడ, మచిలీపట్నం, కాకినాడ టౌన్, అలాగే, తెలంగాణలోని మౌలాలి జంక్షన్, వికారాబాద్, సికింద్రాబాద్ స్టేషన్ల నుంచి ఈ ప్రత్యేక రైళ్లు ప్రయాగరాజ్ కి ప్రయాణించనున్నాయి. కాగా, మహా కుంభమేళాకు వచ్చే భక్తుల అవసరాలు, భద్రత కోసం ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తోంది. ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళాలో ప్రపంచ వ్యాప్తంగా 45 కోట్లమంది భక్తులు పాల్గొని గంగాస్నానం ఆచరించే అవకాశం ఉందని ఆ రాష్ట్ర అధికారులు అంచనా వేస్తున్నారు.

========================

సంచార, పాక్షిక సంచార జాతుల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్ అన్నారు. సంచార, పాక్షిక సంచార జాతుల సంక్షేమంపై ఢిల్లీలో ఈ రోజు జరిగిన సమావేశానికి అధ్యక్షత వహించిన మంత్రి, సంచార జాతుల ప్రజలు కనీస సౌకర్యాలకు దూరం కాకుండా చూసేందుకు రాష్ట్రాలు కేంద్రానికి సహకరించాలన్నారు. కేంద్రప్రభుత్వ పథకాల నుంచి లబ్ధి పొందేందుకు సంచార జాతులకు వీలులేకుండా పోయిందని అన్నారు. వారి వద్ద అవసరమైన ధృవ పత్రాలు లేకపోవడమే ఇందుకు కారణం అన్నారు.

========================

స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు భారీ లాభాలను నమోదు చేశాయి. ముఖ్యంగా ఫైనాన్షియల్, ఆటో, ఐటీ రంగ షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు రాణించాయి. సెన్సెక్స్ 78,507 పాయింట్లతో లాభాల్లో ప్రారంభమై.. చివరికి 79,943 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 445.75 పాయింట్ల లాభంతో 24,188 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ మాత్రం మరో 10 పైసలు క్షీణించి 85.74కి చేరింది.

========================

దేశ రాజధాని ఢిల్లీతో సహా ఇతర ప్రాంతాలలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయని భారత వాతావరణ శాఖ ఐఎండీ పేర్కొంది. ఈ రోజు ఢిల్లీలో ఉష్ణోగ్రతలు 7.6 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయాయని వెల్లడించింది.

=========================

=========================